

రేపు వైసిపి విస్తృతస్థాయి సమావేశం

శ్రీకాకుళం అర్బన్ : వైసిపి జిల్లా విస్తృతస్థాయి, ఆత్మీయ సమావేశాన్ని ఈనెల 12న నగరంలోని ఆనందమయి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల ఫంక్షన్ హాల్‌లో సమావేశ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పార్టీ ఉప సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)తో కలిసి బుధవారం పరిశీలించారు. శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ వై.వి సుబ్బారెడ్డి, కో కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతున్నారని చెప్పారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గ పరిశీలకులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.



ఈద్ ముబారక్

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గాజుల కొల్లివలస వద్ద ఉన్న సంగమయ్య కొండ దిగువన సైకత శిల్పి గేదెల హరికృష్ణ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ సైకత శిల్పాన్ని చెక్కారు. ఈ సైకత శిల్పం పలువురిని ఆకట్టుకుంది.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

టెక్కలి పోరు రసవత్తరం

- లెక్క తేలిన మూడు పార్టీల అభ్యర్థిత్వాలు
- వైసిపికి గ్రూపుల పోరు, ప్రభుత్వ వ్యతిరేకత
- మూడోసారి అచ్చెన్న అభ్యర్థిత్వంపై ప్రజల్లో కొంత విముఖత
- కృపారాణి పోటీతో 'ఇండియా' వేదికలో ఆశలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వచ్చే నెలలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టెక్కలి బరిలో నిలిచేదెవరో లెక్క తేలింది. టెక్కలి నియోజకవర్గానికి కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి పేరును కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో, మూడు ప్రధాన రాజకీయ పక్షాలకు చెందిన అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. వైసిపి నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎన్‌డిఎ కూటమి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఇండియా వేదిక నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున కృపారాణి బరిలో నిలవనున్నారు. వైసిపి, టిడిపి అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ ఉంటుందని ఇప్పటివరకు అంతా భావించినా, కాంగ్రెస్ పార్టీ కృపారాణిని పోటీకి నిలపడంతో ముక్కోణపు పోరు నెలకొంది.



టిడిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు మూడో పర్యాయం బరిలో దిగుతున్నారు. హ్యాట్రిక్ కొట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈసారి అది అంత తేలిక కాదని ప్రత్యర్థి పార్టీల నాయకులు అంటున్నారు. రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో లేరనే విమర్శలు ఉన్నాయి. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయానికి అడపదడపా రావడం తప్ప విశాఖలోనే ఎక్కువ గడిపేవారన్న చర్చ నడుస్తోంది. టిడిపి రాష్ట్ర అధ్యక్షునిగా ఎక్కువ సమయం ఇతర జిల్లాలకు కేటాయించారు తప్ప నియోజకవర్గ ప్రజలకు సమయం వెచ్చించలేదన్న ఆవేదన అత్యధికుల్లో ఉంది. ముఖ్యంగా భావనపాడు పోర్టు విషయంలో ప్రభుత్వం బలవంతంగా భూములు తీసుకోవడం, ఇవ్వడానికి నిరాకరించిన వారి భూములను ప్రొక్లెయిన్‌తో ధ్వంసం చేయించడం, పోలీసు బలగాలను మోహరించి ఇళ్లు, పశువుల పాకల కొలతలను తీసుకోవడం వంటి దుందుడుకు చర్యలకు దిగినా, ఎమ్మెల్యేగా అచ్చెన్నాయుడు తమకు అండగా నిలవలేదన్న బాధ స్థానికుల్లో ఉంది.

వర్షాల్లేక పంటలు ఎండిపోతున్న తరుణంలో పశు సంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆదేశాలతో కోటబొమ్మాళి మండలంలోని ఎత్తిపోతల పథకాలకు సాగునీరు ఆపేసినా, అచ్చెన్నాయుడు కనీసం నోరు మెదపలేదనే ఆవేదన రైతుల్లో ఉంది. టెక్కలి నియోజకవర్గానికి సాగు, తాగు నీరందించే ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను టిడిపి హయాంలో పూర్తిచేయలేకపోయారు. శంఖారావం యాత్ర సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో జిల్లాకు వచ్చిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మూడేళ్లలో పూర్తి చేస్తామంటూ చెప్పుకొచ్చారు. అంటే మళ్లీ అంచనా వ్యయం పెంచి కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరే ప్రయత్నం చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. ప్రభుత్వం నియోజకవర్గాలకు కేటాయించే నిధులతో రోడ్లు, మంచి నీటి పథకాలు నిర్మించడం తప్ప అధికారంలో ఉన్న ఐదేళ్లు, ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఆయన మార్కు అభివృద్ధి పెద్దగా లేదనే చర్చ నియోజకవర్గంలో సాగుతోంది.



దువ్వాడ శ్రీనివాస్



అచ్చెన్నాయుడు



కిల్లి కృపారాణి

సంక్షేమ పథకాలపైనే 'దువ్వాడ' ఆశలు

ఎమ్మెల్సీ, వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ కేవలం ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలనే నమ్ముకున్నట్లుగా కనిపిస్తోంది. దానిపై ఆయన ప్రధానంగా దృష్టిసారించి ప్రచారం సాగిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆఫ్‌షోర్ అంచనాలను మళ్లీ పెంచి ప్రారంభించినా ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రభుత్వ వ్యతిరేకత ఏమీ ఉండదని పైకి చెప్తున్నా, ఐదేళ్ల పాలనలో కచ్చితంగా కొన్ని తరగతుల్లో వ్యతిరేకత సహజం. ప్రత్యేకించి సిపిఎస్ విషయంలో ప్రభుత్వం మాట మార్చడం, అంగన్‌వాడీలపై నిరంకుశంగా వ్యవహరించడం వంటి చర్యలు, విద్యుత్ ఛార్జీల పెంపు, రోడ్ల పరిస్థితి దారుణంగా ఉండటం వంటి చర్యలతో ఓటు బ్యాంకుకు గండి పడే అవకాశం కనిపిస్తోంది. మూలపేట పోర్టు తీసుకొచ్చింది తామేనని, టిడిపి చేయలేని పని తాము చేశామని వైసిపి చెప్పుకుంటోంది. పోర్టులో ఉద్యోగాలు, ఉపాధి, ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే కొంత ప్రభావం ఉండొచ్చు గానీ నిర్మాణంలోనే అంతా తమకనుకూలంగా ఉంటుందని అంచనాలు వేసుకుంటున్నారు.

కాంగ్రెస్‌కు కలిసొచ్చేనా?

ఇండియా వేదిక నుంచి పోటీ చేస్తున్న కిల్లి కృపారాణితో కాంగ్రెస్ ఈసారి భారీగా ఓట్ల శాతం పెంచుకునే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయనే చర్చ విస్తృతంగా సాగుతోంది. పిసిసి అధ్యక్షులు షర్మిల పార్టీ బాధ్యతలు చేపట్టడంతో కాంగ్రెస్‌కు కొంత సానుకూలంగా మారింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లవడంతో ఆ గాయం ప్రభావం అంతగా ఉండదనేది ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. పైగా విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్, వెనుకబడిన శ్రీకాకుళానికి వెనుబడిన ప్రాంత నిధి ఇవ్వకుండా పదేళ్లు మోసం చేసిన బిజెపికి, ఆ కూటమి తరుపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అచ్చెన్నాయుడిపై ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు. దీంతో గణనీయంగా ఓట్లు సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సిపిఎస్‌పై ప్రభుత్వం మాట తప్పడం, పిఆర్‌సి, ఐఆర్ వంటి విషయంలో ప్రభుత్వం... ఉద్యోగుల ప్రయోజనాలను దెబ్బతీయడం, ఉద్యోగులు, ఉపాధ్యాయులు సాగించిన పోరాటాలను ప్రభుత్వం అణచివేయడం వైసిపికి నష్టం కలిగించనున్నాయనే అభిప్రాయం వినిపిస్తోంది. తమ డిమాండ్ల సాధనకు ఆందోళనలు చేసిన అంగన్‌వాడీలు, సమగ్రశిక్ష ఉద్యోగులు, పంచాయతీ వర్కర్ల పోరాటాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం వారిపై నిర్బంధాన్ని ప్రయోగించింది. ఉద్యోగుల ఆందోళనలకు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అచ్చెన్నాయుడు కనీసం సంఘీభావం తెలపకపోవడంతో ఆగ్రహంతో ఉన్నారు. ఉద్యోగులు, చిరుద్యోగులు ఇతర తరగతులు తమకు అండగా నిలుస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



విమలా రణదివే చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న నర్సింగరావు తదితరులు

ఎన్‌డిఎ కూటమిని ఓడించాలి

- మళ్లీ అధికారంలోకొస్తే ప్రభుత్వరంగం మిగలదు
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బిజెపి, దానికి మద్దతుగా నిలబడుతున్న పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సిఐటియు జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీల నుంచి ఎన్నికల బాండ్ల ద్వారా రూ.8251 కోట్లు మింగి, వాళ్లకు దేశ సంపదను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దోచిపెట్టిందని విమర్శించారు. ప్రపంచంలోనే ఇది పెద్ద కుంభకోణమన్నారు. దేశ సంపదను, ప్రజల ఆస్తులను అమ్మడానికి బిజెపికి అధికారం ఇవ్వలేదన్నారు. రాజ్యాంగ మూల స్తంభాలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, మీడియాను మోడీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని విమర్శించారు. కేంద్రంలో బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం అవుతాయన్నారు. ఈ రంగాలు అందించే సౌకర్యాలన్నీ ప్రజలకు అందుబాటులో లేకుండా పోతాయని తెలిపారు. సామాజిక న్యాయం దెబ్బతింటుందని, తాత్కాలిక ఉద్యోగాలు ప్రవేశించి కార్మికులు, ఉద్యోగులకు అభద్రత పెరుగుతుందన్నారు. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తాయని తెలిపారు. కార్మిక వర్గానికి బానిసత్వం మిగులుతుందని, అందుకే బిజెపిని తిరిగి అధికారంలోకి రాకుండా చూడాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు మద్దతు తెలుపుతున్నాయని విమర్శించారు. కేసుల నుంచి కాపాడుకోవడానికి బిజెపితో అంటకాగి, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. మేడేను జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, పారిశ్రామిక కేంద్రాల్లో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

తొలుత మహిళా ఉద్యమ నేత విమలా రణదివే 109వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా హక్కుల రక్షణకు, కార్మిక హక్కుల పరిరక్షణకు ఆమె ఎంతగానో పోరాడారని గుర్తు చేశారు. మహిళా సాధికారిత, మహిళా హక్కుల పరిరక్షణ, భద్రత, ఉద్యోగ అవకాశాలు, రిజర్వేషన్లు, వేధింపులు, హింసలాంటి సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయడం ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.నాగమణి, ఎం.ఆదినారాయణమూర్తి, ఎన్.వి రమణ, హెచ్.ఈశ్వరరావు, కె.సూరయ్య, ఆర్.ప్రకాష్, బి.ఉత్తర తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- స్వేచ్ఛగా, సజావుగా నిర్వహణే లక్ష్యం
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - పొందూరు, జి.సిగడాం, ఎచ్చెర్ల

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. హింసకు తావు లేకుండా, ఎన్నికలు తిరిగి నిర్వహించే అవసరం రాకుండా పూర్తి స్వేచ్ఛగా, సజావుగా సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని చెప్పారు. పొందూరు, జి.సిగడాం, ఎచ్చెర్ల తహశీల్దార్ కార్యాలయాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఇప్పటికే చేసిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశాల్లో ఎటువంటి తేడా వచ్చినా అందుకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పటిష్టంగా పనిచేసే విధంగా ముందుగానే తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉండాలని సూచించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం ఏర్పాట్ల విషయమై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతాపరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు.



ఎచ్చెర్ల : ఐఎంఎల్ డిపోలో మద్యం స్టాకును పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

పోలింగ్ సిబ్బందికి సామగ్రిని అందించడంలో ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. గొబ్బూరులో పోలింగ్ స్టేషన్ సందర్శించి ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. పొగిరిలో చెక్‌పోస్టు, నవభారత్ జంక్షన్ వద్ద ఎఫ్ఎస్‌టి బృందం పనితీరును పరిశీలించారు. ఎచ్చెర్ల తహశీల్దార్ కార్యాలయంలో సన్నద్ధతను పరిశీలించారు. అక్కడికి కొద్దిదూరంలో ఉన్న ఐఎంఎల్ డిపోను సందర్శించి మద్యం స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజువారీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీరామ్మూర్తి, తహశీల్దార్లు ఉమామహేశ్వరరావు, ఎం.పాల్‌కిరణ్, ఎంపిడిఒలు వెంకన్నబాబు, సిహెచ్.సూర్యనారాయణ, ఎస్ఐలు మధుసూదనరావు, రవికుమార్, డిటి వై.వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారానికి అనుమతి అవసరం లేదు

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంటింటి ప్రచారానికి ముందస్తు అనుమతి అవసరం లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించి ఆయా రాజకీయ పార్టీలు ఇంటింటి ప్రచారం నిర్దేశిత వేళల్లో ఎప్పుడైనా చేపట్టవచ్చన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలున్నా రాజకీయ పార్టీల ప్రతినిధులు తమకు తెలియజేయాలని, వాటి పరిష్కారానికి నిబంధనల ప్రకారం చర్యలు చేపడతామని చెప్పారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఇప్పటివరకు 972 ఫిర్యాదులు రాగా, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకున్నామన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుందని, 26న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు 29 చివరి తేదీ అని తెలిపారు. రాజకీయ పార్టీలు అనుమతుల కోసం సువిధ, ఎన్కోర్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఎలాంటి ఆలస్యం లేకుండా మంజూరు చేస్తున్నామన్నారు. ఇందులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులు, మంచానికే పరిమితమైన రోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామని చెప్పారు. ఇది తప్పనిసరి కాదని, మే 12వ తేదీ వరకు హోం ఓటింగ్ సౌకర్యానికి వీరికి అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికలను స్వేచ్ఛగా, సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సహకారం అవసరమన్నారు. సమావేశంలో డిఆర్ఒ ఎం.గణపతి రావు, రౌతు శంకరరావు (వైసిపి), పి.ఎం.జె బాబు (టిడిపి), సురేష్ సింగ్ (బిజెపి), లాస సోమేశ్వరరావు (బిఎస్‌పి), డి.గోవింద మల్లిబాబు (కాంగ్రెస్), రట్టి ప్రకాశరావు (సిపిఎం), ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి నవీన్

ఓటింగ్ శాతం పెంపునకు కృషి

ఆమదాలవలస : సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా ఓటర్లలో చైతన్యం పెంచాలని జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్ అధికారులకు సూచించారు. పట్టణంలోని ఒక కళ్యాణ మండపంలో ఆమదాలవలస, పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి మండలాలకు చెందిన బిఎల్‌ఒలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అధికారులు ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. అటువంటి ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించి ఆయా ప్రాంతాల్లో సక్రమంగా ఓటింగ్ విధానం నిర్వహించడానికి చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన సౌకర్యాలు, చేపట్టాల్సిన చర్యలను ఎప్పటికప్పుడు పరిశీలించారు. ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల డిటి మురళీధర్ నాయక్, తహశీల్దార్లు రమేష్‌బాబు, వేణుగోపాల్, అంబేద్కర్, సెక్టార్ అధికారులు, బిఎల్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

నిరూపిస్తే రాజకీయాల నుంచి నిష్క్రమణ

- రాజీనామాలు చేసిన వాలంటీర్లను తిరిగి నియమిస్తాం
- రెవెన్యూ మంత్రి ధర్మాన

ప్రజాశక్తి - గార

తన 40 ఏళ్ల ప్రజా జీవితంలో లంచం రూపంలో ఒక్క రూపాయి అయినా ఎవరి నుంచి తీసుకున్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని లింగాలవలసలో వైసిపి ముఖ్య నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై కొన్ని పత్రికలు, ఛానళ్లు తప్పుడు వార్తలు రాస్తున్నాయన్నారు. వాలంటీరు వ్యవస్థ వద్దన్న చంద్రబాబు నాయుడు ఇప్పుడు రూ.పది వేలు ఇస్తాననంటున్నారని, మాట మార్చడం ఆయన నైజమని విమర్శించారు. ఆయనకు తోడుగా పవన్ కళ్యాణ్ కూడా వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు.

అవసరార్థం మాటలు మార్చడం, ఎన్నికలయ్యాక ఆ మాటలు, హామీలు మర్చిపోవడం వారికి సర్వసాధారణమన్నారు. ఎన్నికల సమయంలో రాజీనామా చేసి వైసిపి ప్రభుత్వానికి సంఘీభావం తెలుపుతున్న వాలంటీర్లను మళ్లీ వైసిపి ప్రభుత్వం వచ్చాక తిరిగి నియమిస్తామని హామీనిచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్నందున క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల సభ్యులు సమర్థంగా పనిచేయాలని సూచించారు. వైసిపి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాల ద్వారా రూ.2.6 లక్షల కోట్లను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే అందించామన్నారు. రైతులు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాలకూ సమ ప్రాధాన్యం ఇచ్చామన్నారు.

రైతు, పొదుపు సంఘాల రుణాలన్నీ తీర్చేస్తానని చెప్పి చంద్రబాబు నాయుడు మాట తప్పారని, వైఎస్ జగన్ మాత్రం మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని కొనియాడారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు గానీ ఆయన రాజకీయ ప్రస్థానమంతా మోసపూరితమని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో మేలు చేసే ప్రభుత్వానికి మరోసారి మద్దతునివ్వాలని కోరారు.



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

'ఇండియా' ఫోరం అభ్యర్థిని గెలిపించండి

ప్రజాశక్తి - నరసన్నపేట, పోలాకి

నరసన్నపేట నియోజకవర్గంలో ఇండియా ఫోరం అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి నరసింహమూర్తిని గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ కోరారు. నరసన్నపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇండియా ఫోరం ముఖ్య నాయకుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఈ ఎన్నికల ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు ధారాదత్తం చేశారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందన్నారు. అలాంటి పార్టీతో జత కలిసిన టిడిపి, జనసేన, బిజెపికి వంత పాడుతున్న వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఇండియా ఫోరం అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఫోరం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి నరసింహమూర్తి అధ్యక్షత వహించిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మామిడి సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఎల్.సింహాచలం, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాపర వెంకటరమణ


మాట్లాడుతున్న లక్ష్మణరావు

'జై భారత్' అభ్యర్థులను ఆదరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నీతి, నిజాయితీలే కొలమానంగా జిల్లాలో అభ్యర్థుల ఎంపిక జరిగిందని, వారిని ప్రజలు ఆదరించాలని జై భారత్ నేషనల్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ చౌదరి లక్ష్మణరావు అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం పార్లమెంట్, ఇతర అసెంబ్లీ స్థానాలకు సాధారణ జీవనం గడుపుతున్న అభ్యర్థులను ఎంపిక చేసిన ఘనత జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వి.వి.లక్ష్మీనారాయణకే దక్కుతుందన్నారు. పార్లమెంట్ అభ్యర్థి ఇప్పిలి సీత రాజు మాట్లాడుతూ మాట్లాడుతూ రాజకీయాలను వ్యాపారం చేశారని సీట్లు రూ.కోట్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అందుకు భిన్నంగా ప్రజల నుంచి నాయకత్వ లక్షణాలు ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసి బరిలోకి దింపారన్నారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, పలాస అభ్యర్థులు, రాగోలు నాగ శివ, బురిడీ గౌరి శంకర్, చీపురు రవికుమార్, బైపల్లి పరమేశ్వరరావు, గోళ్ల తిరుపతిరావు, బద్రి సీతమ్మ యాదవ్‌లు బరిలో ఉన్నారని వివరించారు. ఓటర్లు టార్చిలైట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.


సామగ్రిని అందజేస్తున్న ఎస్‌పి రాధిక

ట్రాఫిక్ పోలీసులకు సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వరం ఛారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు క్యాప్స్, చలువ కళ్లద్దాలు, వాటర్ బాటిళ్లను ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు. వీటిని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్.రాధిక ట్రాఫిక్ పోలీసులకు బుధవారం అందజేశారు. ఈ మేరకు వరం ఛారిటబుల్ ట్రస్టు పేరిట అందిస్తున్న సేవలను కొనియాడారు. వేసవి కాలంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడే వస్తు సామగ్రి ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. తద్వారా ఎండ తీవ్రతను తట్టుకొని ట్రాఫిక్ సిబ్బంది మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, అంధవరపు ప్రసాదరావు, సంతోష్‌కుమార్, ట్రాఫిక్ సిఐ ఎం.అవతారం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిఒ రవి

జాబ్‌కార్డుదారులందరికీ 'ఉపాధి'

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి హామీలు చూపించాలని ఎపిఒ తెంబూరు రవి సిబ్బందికి సూచించారు. స్థానిక ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలతో రెండు పూటలా పనులు చేయించాలనిన్నారు. కనీస కూలి రూ.300 తగ్గకుండా ఉండాలని పేర్కొన్నారు. వంద రోజులు పని దినాలు కల్పనపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని పంచాయతీల్లోనూ పనులు చేపట్టాలన్నారు. ప్రతి పంచాయతీలోనూ నిర్ధేశించిన లక్ష్యాలకు తగ్గకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇసి ఆదినారాయణరెడ్డి, నాయుడు పాల్గొన్నారు.

ఎన్‌డిఎ కూటమికి గుణపాఠం తప్పదు


ఆమదాలవలస : ప్రచారం చేస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాయా ఎన్‌డిఎ కూటమి పార్టీలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని మెట్టక్కివలసలో బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఒక్కడిపై ఇంత మంది దాడి చేస్తున్నారని, చంద్రబాబు, దత్తపుత్రుడు, బిజెపి కాంగ్రెస్ కలిసి జగన్ ఓడించడానికి ఏకమవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, బొడ్డేపల్లి అజంతాకుమారి, ముత్తా విజయ్, మరాఠీ వెంకటేష్, అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, పొడుగు శ్రీనివాసరావు, మామిడి రమేష్, దుంపల శ్యామలరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: వైసిపి హయంలో అభివృద్ధి చేశామని, ఫ్యాన్ గుర్తుపై ఓట్ వేసి తమను, ఎంపీ అభ్యర్థి పి.తిలక్‌ను గెలిపించాలని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కోరారు. మండలంలోని అక్కుపల్లి, బైపల్లి, బాతుపురం, రిట్టపాడు, పల్లిసారథి గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలులో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ పథకాలు అందాంచామని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి యు.నీలవేణి, సర్పంచ్‌లు లండ రామలింగం, డొంక ఉషారాణి, బత్తిని సృజన పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని బుడుమురు, బెజ్జిపురం, బొంతుపేట గ్రామాల్లో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఆర్.బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, దన్నాన రాజనాయుడు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : సాయంత్రం 9,13,14,15 వార్డుల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల దివ్యభారతి, లాభాల స్వర్ణమని, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్‌పట్నాయక్, సాలిన ఢిల్లీరావు, కౌన్సిలర్లు


కోటబొమ్మాళి : ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్


వజ్రపుకొత్తూరు : ప్రచారం చేస్తున్న మంత్రి అప్పలరాజు

బడ్డేపు ఆదిలక్ష్మి, నీలాపు లక్ష్మి, పరపతి మంజులత, సుగ్గు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని పాశిగంగుపేటలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లింగాల ఉషారాణి, సర్పంచ్ గేదేల వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి గంగు శోభరాణి, ఎంపిటిసి పడాల శాంతరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని కోటబొమ్మాళి, కొత్తపేట గ్రామాల్లో వైసిపి ఎంపీ అభ్యర్థి పి.తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌లు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పార్టీ అద్యక్షులు నూక సత్యరాజు, వైస్ ఎంపిపిలు దుక్క రోజా, బోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఒక్కఛాన్స్ అంటూ సర్వనాశనం


ఆమదాలవలస : ప్రచారం చేస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్ర భవిష్యత్‌ను సర్వనాశనం చేసిందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని వంజంగి, వంజంగిపేట గ్రామాల్లో సర్పంచ్ పైడి లక్ష్మి, మాజీ సర్పంచ్ ఎండ అప్పలనాయుడు ఆధ్వర్యాన శంఖారావం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలపై జనసేన, బిజెపి నియోజకవర్గ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం వైసిపి నుంచి 20 కుటుంబాలు టిడిపిలోకి చేరారు. వీరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నూకరాజు, సలపల ఢిల్లీశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, మెట్ట సుజాత, హనుమంతు బాలకృష్ణ, అన్నెపు భాస్కరరావు, ఎండ భీష్మ, సర్పంచ్‌లు బొడ్డేపల్లి గౌరీపతిరావు, గొండు రమణమూర్తి, చేపేన సత్తిరాజు పాల్గొన్నారు.

కంచిలి: రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి వేసి గెలిపించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు.


పలాస : ప్రచారం చేస్తున్న గౌతు శిరీష

మండలంలోని రేఖాదేవీపురం, డీజిపురం గ్రామాల్లో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజుతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.

కవిటి: నిత్యం ప్రజలతో ఉంటూ, ప్రజా సంక్షేమాన్ని కోరుకునే ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను మరోసారి గెలిపించాలని ఆయన భార్య నీలోత్పల కోరారు. మండలంలోని గొండ్యాలపుట్టుగలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు.

ఇచ్ఛాపురం : రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కూటమి పార్టీలు సమిష్టిగా పనిచేద్దామని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బిజెపి, టిడిపి సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైకుంఠరావు, బి.నిర్మలారెడ్డి, కాళ్ల ధర్మారావు, నందిక జాని, సదా నందా రౌలో, అసి సత్యం పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరిస్తూ పార్టీ విజయానికి తనకు ఓటు వేయాలని టిడిపి అభ్యర్థి గొండు శంకర్ కోరారు. నగరంలోని సీపన్నాయుడుపేట, ఖైరివానిపేట, బచ్చువానిపేట ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి పైడి వేణుగోపాలం, పైడి రాజారావు, కూన సత్యం, సీపాన రాములు. సీపాన అప్పలనాయుడు, గురుగుబిల్లి వాసుదేవరావు, గురుగుబిల్లి వంశీకృష్ణ. అన్నెపు రమణ, పూజారి రామ్మూర్తి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : టిడిపి ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషలకు మద్దతుగా మండలంలోని పెద్దబొడ్డపాడు పంచాయతీలో కణితి సురేష్, మాజీ ఎంపిపి జి.వసంతస్వామి, దుంపల వల్లభరావు, తమ్మినాన గోపాలరావు, మణిగాం తాతయ్యలు ప్రచారం నిర్వహించారు.

పలాస: గౌతు లచ్చన్న, గౌతు శివాజీలు అరవై ఏళ్ల పరిపాలించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, తనకు ఒక్క అవకాశం ఇస్తే పలాస నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష


కంచిలి : అశోక్ నుదుటికి తిలకం దిద్దుతున్న మహిళ

అన్నారు. మండలంలోని బుడంబో, చీపి పంచాయతీల్లో బుధవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఒక్కసారి ఎమ్మెల్యే, మంత్రి పదవి చేపట్టి నియోజకవర్గంలోని వనరులన్నీ దోచుకున్నారని దోచుకున్నారని ఆరోపించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ఐదో వార్డులో బుధవారం టిడిపి నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. పలాస ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష, ఎంపీ రామ్మోహన్ నాయుడును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవిన్, తిరునగరి తిరుమలరావు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అలాగే చినంచల, కేదారిపురం, ఈదురాపల్లి గ్రామాల్లో ప్రచారం చేపట్టి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, దువ్వాడ సంతోష్ రామ్‌నాయుడు, తమ్మినేని గంగారం, పినకన తిరుమలరావు, పనకన రమేష్, ఫైల్ చక్రధర్, ఫైల్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : ప్రచారం చేస్తున్న గొండు శంకర్


పోస్టర్లను అందజేస్తున్న పరమేశ్వరరావు

'బైపల్లి' ప్రచారం

కోటబొమ్మాళి: పేదవాడు, రైతులు ధనవంతులు అవ్వాలంటే లక్ష్మీనారాయణ పెట్టిన జై భారత్ నేషనల్ పార్టీ గుర్తు టార్చిలైట్‌కి ఓటు వేసి గెలిపించాలని టెక్కలి నియోజకవర్గ అభ్యర్థి బైపల్లి పరమేశ్వరరావు కోరారు. పార్టీ నాయకులతో కలిసి కొత్తపేటలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యావంతులు, యువకులు, మహిళలు, రైతాంగంతో పాటు అన్ని తరగతుల ప్రజలకు జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకులు లక్ష్మీనారాయణ అధికారంలోకి వస్తే అన్ని రకాలుగా ఆదుకుంటారని అన్నారు. ఈ మేరకు ఇంటింటా ప్రచారం చేసి పోస్టర్లను అందజేశారు.


లావేరు : రాజీనామా పత్రాలను చూపిస్తున్న వాలంటీర్లు

వాలంటీర్లు రాజీనామా

లావేరు : మండలంలోని తాళ్లవలస, చిన్నమురపాక, కొత్తకుంకం గ్రామ సచివాలయాలకు చెందిన 45 మంది వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. ఆయా రాజీనామా పత్రాలను కార్యదర్శులకు అందజేశారు. ప్రతిపక్ష పార్టీలు చేసిన ఆరోపణలకు వ్యతిరేకంగా స్వచ్ఛందగా రాజమాలు చేశామన్నారు.

నందిగాం : మండలంలో 37 పంచాయతీల్లోని 262 మంది వాలంటీర్లు సామూహికంగా బుధవారం రాజీనామా చేశారు. ఈ రాజీనామా పత్రాలను ఎంపిడిఒ జి.శివప్రసాద్, సీనియర్ సహాయకులు డి.నర్సింగరావులకు అందజేశారు.

టెక్కలి రూరల్ : టెక్కలి గ్రామ సచివాలయం-2 పరిధిలోని వాలంటీరు రాజీనామా చేశారు. ఈ పత్రాన్ని కార్యదర్శి బగాది ఉపేంద్రకు అందజేశారు. జగనన్నను ముఖ్యమంత్రి చేయాడినికి కృషి చేస్తామని అన్నారు.


విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపిపి దాస్

హోమియో వైద్యానికి పెరిగిన ఆదరణ

ప్రజాశక్తి- కవిటి

ప్రస్తుత రోజుల్లో హోమియో వైద్యానికి ఆదరణ లభిస్తోందని సోంపేట ఎంపిపి డాక్టర్ దాస్ అన్నారు. ప్రపంచానికి హోమియో వైద్యం పరిచయం చేసిన శామ్యుల్ హనీమాన్ 269వ జయంతి వేడుకలు బుధవారం జగతిలో సర్పంచ్ పూడి వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా హనీమాన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో సగానికిపైగా ప్రజలు హోమియో వైద్యం వైపు దృష్టి పెట్టారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు దుర్గాప్రసాద్ పట్నాయక్, సుబ్బారెడ్డి, గోవింద్, జయప్రకాష్, గ్రామస్తులు భావన సీతారామ్మూర్తి నాయుడు, పూడి జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఎచ్చర్ల : డాక్టర్ బిఆర్ఎయు న్యాయ విభాగపు విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉత్సాహంగా... ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ విసి కె.ఆర్.రజని, రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య పాల్గొని మాట్లాడారు. ఎంచుకున్న రంగంలో అంకితభావం, నిబద్ధత, నిజాయితీతో కూడిన పయనం సాగించాలని సూచించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం విద్యార్థులు సినీ గీతాలకు నృత్యం చేశారు. కార్యక్రమంలో న్యాయ విభాగపు అధ్యాపకులు డాక్టర్ వై.రాజేంద్రప్రసాద్, డాక్టర్ జి.జయలక్ష్మి, డాక్టర్ జె.కె.ఎల్.సుజాత, డాక్టర్ మన్మథరావు, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఎల్‌జి సరికొత్త టివి ఆవిష్కరణ

శ్రీకాకుళం: గృహ ఉపకరణాల సంస్థ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ తమ నూతన ఉత్పత్తి క్యూనీడ్-83ని మార్కెట్‌లోకి రిలయన్స్ స్టోర్‌లో బుధవారం అట్టహాసంగా విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రిలయన్స్ ఎపి టిజి రీజనల్ మేనేజర్ అభిషేక్ మాట్లాడుతూ తమ స్టోర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఉత్పత్తి ఎ1 ఆధారితంగా పని చేస్తూనే వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకుంటుందని అన్నారు. గొప్ప పిక్చర్ క్లారిటీతో సరికొత్త అనుభూతిని ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌జి సంస్థ రీజనల్ హెడ్ కృష్ణజీ, బ్రాంచ్ మేనేజర్ యుగంధర్, రిలయన్స్ క్లస్టర్ ఐమాన్, స్టోర్ మేనేజర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తి 'కానూరి'

పలాస : విప్లవ సాంస్కృతిక ఉద్యమ ధ్రువతార కానూరి వెంకటేశ్వరరావు అని అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్షులు సౌర్ర రామారావు అన్నారు. సమైక్య వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ కానూరి తొమ్మిదో వర్ధంతి సభ మండలంలోని సూదికొండ కాలనీలోని న్యూ డెమోక్రసీ కార్యాలయంలో బుధవారం విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో అరుణోదయ సాంస్కృతిక సమైక్య పురుడుపోసుకుందని కానూరి ఏడు దశాబ్దాలు ప్రజా జీవితంలో ప్రజా కళలకు అంకితమై కవిగా, రచయితగా, కళాకారుడుగా, బుర్రకథ కళాకారునిగా విప్లవ సాంస్కృతిక ఉద్యమాన్ని విస్తరింపజేశారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కార్యదర్శి కొసెంటి సోమేశ్వరరావు, పిడిఎస్యుయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్, ఎఐకెఎంఎస్ నాయకులు వంకల పాపయ్య, ఆనంద్ కె.సరస్వతి పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు


మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న గాంధీ

మామా అల్లుళ్లను ఓడించాలి

స్వతంత్ర అభ్యర్థి గాంధీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని ఓటర్లు ఇచ్చే ప్రజా తీర్పుతో మామ అల్లుళ్లకు కనువిప్పు కలగాలని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. మండలంలోని చిట్టీవలస, రామచంద్రాపురం గ్రామాల్లో బుధవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి మామ అల్లుళ్ల ఇద్దరు వేర్వేరు పార్టీల్లో ఉన్నా... ఒకే తాను ముక్కలని ప్రజలకు వివరించారు. వారిద్దరి మాయ మాట లు విని ఓటర్లు మోసపోవద్దని సూచించారు. గడచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని తొగరాం పంచాయతీ, ఎంపిటిసి ఎన్నికల్లో పార్టీలకతీతంగా ఇద్దరు ఒక్కటయ్యారని అన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ ప్రజలు ఆలోచించి తనకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొరాడ రవి, సీర చిట్టెయ్య, గొండే మోహన్, గొంటి లక్ష్మణ్, పామల సాయి, వై.వాసు, బి.చిన్నా రావు, ఎం.వసంత, కె.రాము పాల్గొన్నారు.

పొందూరు: ఆమదాలవలస నియోజకవర్గం అభివృద్ధికి స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీకి ఒక్క అవకాశం కల్పించాలని ఆయన భార్య, మాజీ ఎంపిపి, ఎంపిటిసి సువ్వారి దివ్య కోరారు. పొందూరు మండలంలోని తుంగపేట, లైదాం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గాంధీని గెలిపించాలని అభ్యర్థించారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, ఢిల్లీశ్వరరావు, సూర్యారావు, సాయికుమార్, శివ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పకడ్బందీగా నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లు

ఇచ్ఛాపురం: ఈ నెల 18 నుంచి సార్వత్రిక ఎన్నికలు నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గ పోలీసులతో, రెవెన్యూ అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రూట్లలో పోలింగ్ వాహనం పర్యటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సోంపేటలో స్ట్రాంగ్ రూమ్ కస్టడీ, నామినేషన్ సమయంలో శాంతిభద్రతలు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

'తెప్పల'కు ఉగాది కవితా పురస్కారం

పలాస : శ్రీక్రోధి ఉగాది సందర్భంగా శ్రీకాకుళం తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యాన గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన 'ఉత్తరావిల్లి ఊసులు పుస్తకావిష్కరణ, కవిసమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పలాస జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి గాది కవితా పురస్కారం అందజేశారు. 'పలుకే బంగారం' అను కవితా గానం చేసి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, నిర్వాహకులు గుడిమెట్ల గోపాలకృష్ణ, వావిలపల్లి రాజారావులు దుశ్శాలువలు కప్పి సన్మానించారు.

చలివేంద్రం ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్ : ప్రజల దాహార్తిని తీర్చడం గొప్ప వరమని శ్రీకాకుళం ఎస్ఐ మొజ్జాడ ప్రవల్లిక అన్నారు. నగరంలోని సూర్యమహల్ కూడలి వద్ద జిల్ ఫౌండేషన్ జాడ సాయి ఆధ్వర్యాన మజ్జిక చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి తాపానికి ప్రజలంతా ఇబ్బందిపడుతున్నారని, వేసవి గాలులకు వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందని అన్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఎక్కువగా నీరు ఉండే పదార్థాలను తీసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా ముఖ్య కూడలిలో చలివేంద్రాలను స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక సేవకులు ఉర్లం శివతేజ, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు పొడుగు చరణ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ఆమదాలవలస: ప్రజాస్వామ్య పరిరక్షణ, స్వచ్ఛమైన పరిపాలన కోసం స్వేచ్ఛగా ఓటు వేయాలని, మీ ఓటుతోనే రేపటి మన తీర్పు ఉంటుందని వైసిపి క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు స్వయంశక్తి సంఘాల మహిళలకు పిలుపునిచ్చారు. మండలంలోని అక్కివరం, బెలమాం గ్రామ సంఘం మహిళలతో ఓటు ప్రాముఖ్యతపై బుధవారం అవగాహనా ర్యాలీలు నిర్వహించారు.

పోస్టల్ సేవలు విస్తృతం

ఇచ్ఛాపురం: వినియోగదారులకు పోస్టల్ సేవలు విస్తృతం చేయాలని పోస్టల్ సూపరింటెండెంట్ ఎ.హరిబాబు ఆదేశించారు. పట్టణంలోని ప్రధాన తపాలా శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోస్టల్ కార్యాలయం ద్వారా ఆధార్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. ఇన్సూరెన్స్ సేవలు కూడా


రికార్డులను పరిశీలిస్తున్న హరిబాబు

ప్రజలు వినియోగించుకోలన్నారు. ఏడాదికి రూ.399 చెల్లిస్తే... ప్రమాదంలో మృతి చెందితే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా క్లయిమ్ వర్తిస్తుందని అన్నారు. అలాగే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా ద్వారా ఏడాదికి రూ.19 చెల్లిస్తే ప్రమాద బీమా రూ.2 లక్షలు వస్తుందని అన్నారు. ప్రజలకు ఎటువంటి సేవలు అందిస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింతగా సేవలు అందించేందుకు సేవింగ్ అకౌంట్ కౌంటర్ మరొకటి అదనంగా ఏర్పాటు చేశామని, దీంతో పాటు ఆధార్ సెంటర్ సేవలూ ప్రారంభించామని తెలిపారు. కొత్త ఆధార్ కార్డులతో పాటు చేర్పులు, మార్పులకు అవకాశం ఉందన్నారు. పోస్టల్ ఖాతాదారుల రద్దీ పెరగడంతో ఖాతాదారులకు ఇబ్బంది లేకుండా అదనంగా మరో సేవింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం


మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

కోటబొమ్మాళి: రాజీ మార్గం ద్వారానే కక్షిదారులు తమ కేసులు పరిష్కరించుకోవాలని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు, నౌపడ పోలీసులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 11న కోర్టులో జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహిస్తామని తెలిపారు. వీటిలో అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తామని అన్నారు. న్యాయవాదులు, పోలీసులు ముందుగానే కేసులను గుర్తించి కోర్టుకు తెలియజేయాలన్నారు. అనంతరం లోక్ ఆదాలత్‌లో చర్చించి రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎక్కువ సంఖ్యలో కేసులను రాజీ చేసుకొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నౌపడ ఎస్ఐ కిషోర్‌శర్మ, కుమార్, బాలకృష్ణ, వెంకటరావు, నాగరాజు, అశోక్ పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ఇచ్ఛాపురం : సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలా మంది స్వచ్ఛందంగా వైసిపిలోకి చేరుతున్నారని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డుకు చెందిన దట్టి రామారావు, గిరి, ధనుంజయ, రమేష్, వాసుతో పాటు 70 కుటుంబాలు వైసిపిలో బుధవారం చేశారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్‌పట్నాయక్, సాలిన ఢిల్లీరావు, సుగ్గు ప్రేమ్‌కుమార్, పరపతి కోటి, ప్రత్తి అన్వేష, తాడి ఆదిరెడ్డి, నీలాపు ఢిల్లీరావు, రామ్, కిరణ్ బెహరా పిలక సంతు పాల్గొన్నారు.

నరసన్నపేట : నియోజకవర్గంలో టిడిపి నుంచి 15 కుటుంబాలు వైసిపిలోకి పలువురు చేరారు.


ఇచ్ఛాపురం : పార్టీ కండువా వేస్తున్న విజయ

వీరికి వైసిపి బిసిసెల్ జోనల్ రాష్ట్ర ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జనసేన పార్టీ నుంచి కూర్మాన రమేష్, నరసింహమూర్తి, కోటేశ్వరరావు, వాసుదేవరావు, చిరంజీవి, సాయి, రాజు, అజయ్‌కుమార్, దినేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన దాలినాయుడు, పాగోటి గోవిందరావు, బుద్దల రాజశేఖర్ పాల్గొన్నారు.


విందులో పాల్గొన్న వెంకన్న చౌదరి

ఇఫ్తార్ విందులో వెంకన్న చౌదరి

పలాస : కాశీబుగ్గ జామియా మస్జీద్‌లో రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులతో టిడిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి బుధవారం పాల్గొన్నారు. ఈ మేరకు ఈద్ ఇఫ్తార్ విందును ఆరగించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

రైల్వే పోలీసులు అప్రమత్తం

పలాస : ఎన్నికల వేళ రైళ్లలో గంజాయి, డబ్బులు తరలే అవకాశం ఉందని, సిబ్బంది అప్రవత్తమై అనుమానిత బ్యాగులను, వ్యక్తులను తనిఖీలు చేయాలని రైల్వే డిఎస్‌పి బి.మోహనరావు ఆదేశించారు. ఈ మేరకు పలాస రైల్వే స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల గంజాయిపై నిఘా పెట్టడంతో పాటు వాటిని సకాలంలో పట్టుకోవడంపై అభినందించారు. నిరంతరం దాడులు కొనసాగించాలని, ఇచ్ఛాపురం నుంచి నెల్లిమర్ల వరకూ ఉన్న పలాస రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రైళ్లలో నేరాలు తగ్గించే విధంగా నిఘా పెట్టాలన్నారు. అనంతరం ఈ ఏడాది జరిగిన క్రైమ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు పోలీసులతో గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో సిఐ వెంకటరావు, ఎస్ఐ షరీఫ్ పాల్గొన్నారు.